ప్రభాత
తెలుగు దినపత్రిక
# జయభేరి
ప్రజల పక్షాన అక్షర యజ్ఞం
jayabherinews
JAYABHERIDAILY.COM
04-10-2024
శుక్రవారం
మల్కాజిగిరి
సంపుటి : 02 | సంచిక : 31 | పేజీలు : 8 | వెల : 4
ఎడిటర్ మోతె రఘు తిరుపతి రెడ్డి
JB
జయభేరి



## డిజిటల్ కార్డ్ సంక్షేమ చరిత్రలో
# సువర్ణ అధ్యాయం

రాష్ట్రంలో అర్హులైన పేదలందరికీ సంక్షేమ పథకాలను సక్రమంగా, మరింత సమర్థవంతంగా అమలు చేయడానికే ఫ్యామిలీ డిజిటల్ కార్డులు FDC జారీ చేస్తున్నట్టు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చెప్పారు. వన్ స్టేట్ – వన్ కార్డు ఆలోచనతో చేపట్టిన ఈ బహుళ ప్రయోజన కార్డుల జారీ ప్రక్రియను ప్రజలంతా వినియోగించుకోవాలని పిలుపునిచ్చారు.

**జయభేరి, హైదరాబాద్ :**

ఫ్యామిలీ డిజిటల్ కార్డు రూపకల్పనకు సంబంధించిన సర్వే పత్రాలను సికింద్రాబాద్‌లోని సిఖ్ విలేజ్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి లాంఛనంగా విడుదల చేశారు. ఈ సందర్భంగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రాధాన్యతను ముఖ్యమంత్రిగారు వివరించారు. రేషన్ కార్డు, ఆరోగ్యశ్రీ, రైతు బీమా, రైతు భరోసా, షాదీ ముబారక్, కల్యాణ లక్ష్మి, ఆసరా పెన్షన్ వంటి ప్రజా సంక్షేమ కార్యక్రమాలకు సంబంధించిన వివరాలు 30 శాఖలు 30 రకాలుగా సమాచారం సేకరించడం వల్ల సమస్యలు తలెత్తుతున్నాయి. అలా కాకుండా అర్హులైన వారందరూ ఒకే కార్డు ద్వారా ఈ సేవలు పొందడానికి వీలుగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు అందజేస్తారు. ఇందుకోసం 3 నుంచి 7 వ తేదీ వరకు అయిదు రోజుల పాటు పైలెట్ ప్రాజెక్టుగా ప్రారంభించాం. ప్రతిపక్షాలు దీనిపై ఎవైనా సూచనలు, సలహాలు ఉంటే ఇవ్వాలి. కుటుంబంలో సభ్యులు పెరిగినందున ప్రజలంతా కుటుంబ డిజిటల్ కార్డు కోసం వివరాలను నమోదు చేయించుకోవాలి. ఇందులో అవసరమైన మార్పుచేర్పులు ఎప్పుడైనా చేసుకోవచ్చు. ఒక్క క్లిక్ తో కుటుంబ సమగ్ర సమాచారం ఉండాలన్న ఆలోచనతో ఈ విధానం తీసుకొచ్చాం. ఒకసారి కార్డు పొందిన తర్వాత రేషన్ తో పాటు ఇతర ప్రభుత్వ సౌకర్యాలను ఎక్కడి నుంచైనా పొందడానికి వీలుంటుంది.

## యువతలో నైపుణ్యాభివృద్ధికి..
### పీఎం ఇంటర్న్‌షిప్ పథకం ప్రారంభం

- రూ.800 కోట్ల అంచనా వ్యయంతో పైలట్ ప్రాజెక్టుకు శ్రీకారం..
- ఐదేళ్లలో 21-24 వయసులోని కోటి మందికి శిక్షణ
- టాప్-500 కంపెనీల్లో పని నేర్చుకునే చాన్స్
- నెలకు రూ.5 వేల చొప్పున స్టైపెండ్
- వన్ టైమ్ గ్రాంట్ కింద మరో రూ.6వేలు

అక్టోబరు 12నుంచి వివరాల నమోదు



**జయభేరి, న్యూఢిల్లీ, అక్టోబరు 3:**

పెద్ద పెద్ద చదువులు చదివినా ఉద్యోగాలు రావట్లేదని వాపోతారు నిరుద్యోగులు! 'మా దగ్గర బోలెడన్ని ఉద్యోగాలున్నాయి.. కానీ, తగిన నైపుణ్యాలున్న అభ్యర్థులే దొరకట్లేదు' అంటాయి కంపెనీలు! చదివిన చదువుకు వాస్తవ ఉద్యోగ/ వ్యాపార వాతావరణానికి పొంతన లేకపోవడం.. యువతలో ఆయా ఉద్యోగాలు చేసేంత నైపుణ్యాలు లేకపోవడమే ఈ సమస్యకు కారణం. ఈ నేపథ్యంలో యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించి ఈ సమస్యను పరిష్కరించే దిశగా కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ఈ ఏడాది బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించిన 'పీఎం ఇంటర్న్‌షిప్' పథకాన్ని కేంద్ర ప్రభుత్వం గురువారం పైలట్ ప్రాతిపదికన ప్రారంభించింది. వచ్చే ఐదేళ్లలో 2124 సంవత్సరాల వయసులో ఉన్న కోటి మంది యువతీయువకులకు.. టాప్500 కంపెనీల్లో ఏడాదిపాటు క్షేత్రస్థాయిలో పని నేర్చుకునే అవకాశం కల్పించడమే ఈ పథకం లక్ష్యం.
కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ కింద.. గడిచిన మూడేళ్లలో చేసిన వ్యయం ఆధారంగా టాప్500 కంపెనీలను కేంద్రం గుర్తించి, వాటి ద్వారా యువతకు ఈ పథకం కింద ఇంటర్న్‌షిప్ సౌకర్యాన్ని కల్పించనుంది. ఇంటర్న్‌గా ఉన్న సమయంలో

...మిగతాది 2 లో



## మళ్లీ నోరు జారిన కంగనా రనౌత్

**జయభేరి, ఢిల్లీ :**

వివాదస్పద బిజెపి ఎంపి, నటి కంగనా రనౌత్ మరోమారు నోరు జారారు. మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా కొత్త వివాదాన్ని లేవదీశారు. లాల్ బహదూర్ శాస్త్రి 120వ జయంతి సందర్భంగా నివాళి అర్పిస్తూ, జాతిపితగా మహాత్ముని స్థాయిని కించపరిచేలా ఆమె పోస్టు పెట్టారు. 'జాతిపిత అంటూ ఎవరూ లేరు, వున్నదల్లా పుత్రులే, వీరందరూ భరతమాత పుత్రులు' అని ఆమె సామాజిక మాధ్యమాల్లో పోస్టు చేశారు. దేశంలో పరిశుభ్రతపై మహాత్ముని వారసత్వాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ముందుకు తీసుకెళుతున్నారని ఆ తర్వాత మరో పోస్టులో పేర్కొన్నారు. కాగా, గాంధీపై అభ్యంతరకరమైన వ్యాఖ్యలంటూ కంగనా పోస్టులపై కాంగ్రెస్ నేత సుప్రియా శ్రినెట్ తీవ్రంగా విమర్శించారు. 'గాడ్సే అభిమానులు బాపూ, శాస్త్రీజీల మధ్య తేడాల గురించి చెబుతున్నారు. ఈ కొత్త గాడ్సే భక్తురాలిని నరేంద్ర మోడీగా మనస్ఫూర్తిగా క్షమిస్తారా? జాతి పిత వున్నారు. పుత్రులు వున్నారు, అమరులు వున్నారు, ప్రతి ఒక్కరికీ గౌరవం దక్కాల్సిందే.' అని సుప్రియా శ్రినెట్ ఎక్స్ పోస్టులో పేర్కొన్నారు. పంజాబ్కి చెందిన మరో సీనియర్ బిజెపి నేత మనోరంజన్ కలియా కూడా రనౌత్ తాజా వ్యాఖ్యలను విమర్శించారు. వివాదాస్పద ప్రకటనలు చేయడం ఆమెకు అలవాటుగా మారిందన్నారు.



## కేటీఆర్, హరీశ్ రావుపై
# కేసు నమోదు

బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు పై కేసు నమోదు అయింది. గురువారం హైదరాబాద్ లోని సైబర్ క్రైమ్ ఆఫీస్ లో మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఫిర్యాదు చేశారు.

**జయభేరి, హైదరాబాద్ :**

మెదక్ ఎంపీ రఘునందన్ రావు ఫిర్యాదు మేరకు కేటీఆర్, హరీశ్ రావుతో పాటు పలు యూట్యూబ్ ఛానల్స్ పై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్టు సైబరాబాద్ క్రైమ్ పోలీసులు వెల్లడించారు. ఇటీవలే సిద్దిపేట జిల్లాలో జరిగిన ఓ ప్రభుత్వ కార్యక్రమానికి మంత్రి కొండా సురేఖ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె స్థానిక ఎంపీ రఘునందన్ రావు ఆమెకు స్వాగతం పలుకుతూ నూలుపోగు దండా వేశారు. దీనిపై బీఆర్ఎస్ శ్రేణులు సోషల్ మీడియా వేదికగా ట్రోల్స్ చేశారని సాక్ష్యాలతో సహా కొండా సురేఖ ఆరోపణలు చేసిన విషయం తెలిసిందే. ఈ విషయంలో కేటీఆర్‌కొండా సురేఖ మధ్య మాటల యుద్ధం సినీ ఇండస్ట్రీ వరకు వెళ్లింది. ఇక ఇదే అంశం పై ఎంపీ రఘునందన్ రావు కూడా స్పందించి బీఆర్ఎస్ శ్రేణులపై మండిపడ్డారు. ఈ ఇష్యూ పై దుబ్బాక, సిద్దిపేట, సైబరాబాద్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో సైబర్ క్రైమ్ పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

## రుణమాఫీపై వివరాలు

- మంత్రి తుమ్మల నాగేశ్వర రావు

**జయభేరి, హైదరాబాద్ :**


రుణమాఫీపై ప్రభుత్వం స్పష్టమైన వివరాలు ఎప్పటికప్పుడు చెప్పినప్పటికి బీజేపీ పెద్దలు, రాష్ట్ర నాయకులు రైతులను గందరగోళ పరిచి వాళ్ల రాజకీయ పబ్బం గడుపుకునేందుకు దీక్షల పేరిట కొత్త డ్రామాకు తెరతీశారు. వారికి అర్థమయ్యే విధంగా మరొక్కసారి వివరాలన్ని తెలియజేస్తున్నామన్నారు మంత్రి తుమ్మల నాగేశ్వరరావు. రాష్ట్రంలో మొత్తం రైతుల సంఖ్య 65.56 లక్షలు అని, వీరిలో తెలంగాణ రాష్ట్రంలో భూములు ఉండి, తెలంగాణలో

...మిగతాది 2 లో



## అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్

2 లో



## తిరుమలలో ఆర్జిత సేవలు ప్రత్యేక దర్శనాలు రద్దు

**జయభేరి, తిరుమల :**

తిరుమల శ్రీవారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఇవాళ రాత్రి అంకురార్పణతో ప్రారంభం అవుతాయి. సాధారణ రోజుల కంటే బ్రహ్మోత్సవాల సమయంలో భక్తులు అధికంగా తిరుమలకు వెళ్తుంటారు. అందులో దసరా సెలవులు కూడా కావడంతో పిల్లలతో సహా కుటుంబం అంతా శ్రీవేంకటేశ్వరుడిని దర్శించుకునేందుకు ఆసక్తి కనబరుస్తారు. ఇక బ్రహ్మోత్సవాల సమయంలో స్వామి వారి దర్శనానికి వచ్చే భక్తులకు ఒక్క రోజులోనే దర్శనమయ్యే విధంగా ఏర్పాట్లు చేశామని.. అదే రోజు

...మిగతాది 2 లో

మొదటిపేజీ తరువాయి

## యువతలో నైపుణ్యాభివృద్ధికి..

అభ్యర్థులకు నెలకు రూ.5000 చొప్పున స్టైపెండ్, దానికి అదనంగా వన్‌టైమ్ గ్రాంట్ కింద రూ.6000.. మొత్తం కలిపి ఏడాదికి రూ.66 వేల ఆర్థికసాయం అందుతుంది. ఇంటర్న్‌లకు ప్రతి నెలా ఇచ్చే రూ.5 వేలల్లో రూ.4,500ను కేంద్రం భరిస్తుంది. ప్రత్యక్ష నగదు బదిలీ విధానంలో అభ్యర్థి ఖాతాలో వేస్తుంది. మిగతా రూ.500, శిక్షణకు సంబంధించిన ఖర్చులను ఆయా కంపెనీలు కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ నిధుల నుంచి ఇస్తాయి. అలాగే, ఇంటర్న్‌షిప్‌లో చేరగానే ఇచ్చే వన్‌టైమ్ గ్రాంట్ రూ.6వేలను కూడా కేంద్రమే ఇస్తుంది. రూ.800 కోట్ల ఖర్చుతో ప్రారంభించిన ఈ పైలట్ ప్రాజెక్ట్ కింద 2025 మార్చి 31తో ముగిసే ఈ ఆర్థిక సంవత్సరంలో 1.25 లక్షల మందికి డిసెంబరు 2 నుంచి ఇంటర్న్‌షిప్ చేసే అవకాశం కల్పించనున్నారు. ఆశావహులు.. అక్టోబరు 12 నుంచి 25 దాకా ఈ పోర్టల్ ద్వారా తమ వివరాలను నమోదు చేసుకోవచ్చు. 26న తుదిజాబితా ప్రకటిస్తారు. అక్టోబరు 27 నుంచి నవంబరు 7 దాకా.. కంపెనీలు ఆ తుది జాబితాలో నుంచి తమకు తగిన అభ్యర్థులను ఎంచుకుంటాయి. ఏడాది మొత్తానికీ ప్రతి ఇంటర్న్‌కూ పీఎం జీవన్ జ్యోతి బీమా యోజన, పీఎం సురక్ష బీమా యోజన కింద బీమా సౌకర్యాన్ని ఉంటుంది.

**తెలంగాణలో ఒక జిల్లా..**

పని నేర్చుకోవాలనే ఆసక్తి ఉన్న యువతకు ఈ పథకం కింద ఆ అవకాశం కల్పించేందుకు.. ఇప్పటికే మూడు కంపెనీలు (అలెంబిక్, మహీంద్ర అండ్ మహీంద్ర, మాక్స్ లైఫ్ ఇన్సూరెన్స్) నాలుగు రాష్ట్రాల్లోని ఏడు జిల్లాల్లో 1,077 ఆఫర్లు ఇచ్చాయి. ఆ జిల్లా ల్లో ఒకటి తెలంగాణ నుంచి ఉండడం గమనార్హం.

**ఎవరు అర్హులు?**

హైస్కూల్, హయ్యర్ సెకండరీ స్కూల్ విద్యలో ఉత్తీర్ణులైనవారు, ఐటీఐ సర్టిఫికెట్ ఉన్నవారు, పాలిటెక్నిక్ విద్యాసంస్థల నుంచి డిప్లొమా పొందినవారు, బీఏ, బీఎస్సీ, బీకాం, బీసీఏ, బీబీఏ, బీఫార్మా వంటి డిగ్రీలు పొందిన పట్టభద్రులు ఈ పథకం కింద దరఖాస్తు చేసుకోవడానికి అర్హులు. కాగా, ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్న కుటుంబాలకు చెందినవారు, ఆదాయపన్ను చెల్లించే కుటుంబాలకు చెందినవారు, వార్షిక ఆదాయం రూ.8 లక్షలు మించిన కుటుంబాల నుంచి వచ్చినవారు పథకానికి అనర్హులు. ఐఐటీ, ఐఐఎం, ఐఐఎస్‌ఈఆర్ వంటి ఉన్నత స్థాయి విద్యాసంస్థల్లో చదివినవారు, సీఏ, సీఎంఏ చేసినవారు అనర్హులు.

## రుణమాఫీపై వివరాలు

ఉన్న బ్యాంకుల ద్వారా పంట రుణాలు తీసుకున్న రైతుల సంఖ్య 42 లక్షలు అని ఆయన తెలిపారు. 2018 రుణమాఫీ పథకంలో గత ప్రభుత్వానికి అందిన ఖాతాలు 40 లక్షలు మాత్రమే అని ఆయన వ్యాఖ్యానించారు. 2018 రుణమాఫీ పథకం కనీసం 20 లక్షల మందికి కూడా రుణమాఫీ కాలేదు. అదికూడా ఆఖరి సంవత్సరం చేసిన విషయాన్ని మీకు గుర్తుండే ఉంటుందన్నారు. అంతేకాకుండా..'అలాకాక మా ప్రభుత్వం గుర్తించిన 42 లక్షల మందికి మొదటి పంటకాలంలోనే రుణమాఫీ 2024 అమలు చేయడానికి మా ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉంది. వీరందరికి 2 లక్షల వరకు రుణమాఫీ చేయడానికి కావాల్సిన మొత్తం అంచనా 31 వేల కోట్లు. వీరిలో 2 లక్షలలోపు రుణాలు తీసుకొని కుటుంబ నిర్ధారణ చేసిన ఖాతాల సంఖ్య 22,37,848. రుణమాఫీ చేసిన మొత్తం 17933.19 వేల కోట్లు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన మొదటి పంటకాలంలోనే 2 లక్షలలోపు రుణాలను రుణమాఫీ చేశాము. ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు మిగతా 20 లక్షల మందికి 2 లక్షల వరకు రుణమాఫీ చేసే బాధ్యత మా ప్రభుత్వానిదే. ఆర్థిక వెసులుబాటు చూసుకుంటు ఇది పూర్తి చేస్తాము. పైన సంబంధించిన లెక్కలలో మీకేమైన అనుమానాలు ఉన్నట్లయితే బ్యాంకువారిగా మీరు కూడా పర్యటించి వివరాలు తీసుకోవచ్చు. ఇంత పారదర్శకంగా లెక్కలు ఉన్నప్పటికి, రుణమాఫీ 2024 పథకం పూర్తి అయినట్లు, మేము ప్రకటించినట్లు మళ్ళీమళ్ళీ అవే అబద్దాలు చెప్పి మీ స్థాయిని దిగజార్చుకోవద్దు. తుమ్మలకి మంత్రిపదవులు కొత్తకాదు. మంత్రిపదవి కోసమో, ఇతర పదవులకు ఆశపడో మాట్లాడే నైజం తుమ్మలది కాదు. గత నెలలో కురిసిన భారీ వర్షాలవలన రైతువారి జరిగిన నష్టం మీకు తెలిసిందే. రాష్ట్ర ప్రభుత్వం విపత్తు నివారణ కింద 10 వేల కోట్ల సహాయం ఆర్థిస్తే కేవలం 400 కోట్లు మాత్రమే విధిల్చిన కేంద్ర ప్రభుత్వం, అక్కడ అధికారంలో ఉన్న బిజెపి పెద్దలను మీరేమన్నా ప్రశ్నించారా?

మీరు తెలంగాణలో మీ పరపతిని పెంచుకోవాలనుకుంటే, తెలంగాణకి వచ్చే నిధుల కోసమో, తెలంగాణ రైతుల ప్రయోజనాల కోసమో రాష్ట్రప్రభుతంతరపున మీరు కూడా కేంద్ర ప్రభుత్వంపై పోరాడండి. కేంద్ర ప్రభుత్వం వరికి ప్రకటించిన మద్ధతు ధర కంటే కూడా రూ.500 బోనస్ అధికంగా సన్న రకాలకు ప్రకటించి ఈ పంటకాలం నుంచే కొనుగోలుకు చర్యలు చేపట్టడం జరుగుతుంది. కేంద్ర ప్రభుత్వం ద్వారా సరఫరా అయ్యే దొడ్డు రకం రేషన్ బియ్యం ఎలా దుర్వినియోగం అవుతుందో మీకు తెలియంది కాదు. ఈ దుర్వినియోగాన్ని అరికట్టడానికి, మా ప్రభుత్వం మీద 2000 కోట్లు అదనపు భారం పడిన కూడా సన్న బియ్యం సేకరించి రాష్ట్రంలోని అన్ని రేషన్ షాపుల ద్వారా తెల్ల రేషన్ కార్డు దారులకు , అన్ని వసతి గృహాల విద్యార్థులకు సరఫరా చేయడానికి ప్రణాళిక చేశాము. కేంద్ర ప్రభుత్వం అమలుచేస్తున్న పిఎం కిసాన్ లబ్ధిదారుల సంఖ్య పథకం ఆరంభించినపుడు 37 లక్షలుగా ఉన్నది. అది గత వాయిదాలో 30 లక్షలకు కుదించడం జరిగింది. ఈ లెక్క గురించి కూడా సమాధానం చెప్తే తెలంగాణ రైతాంగం హర్షిస్తుంది. ఇప్పటికైనా బిజెపి రాష్ట్ర నాయకులు నా గురించి చేసిన వ్యాఖ్యలను ఉపసంహరించుకోవాల్సిందిగా సూచిస్తున్నాను.' అని మంత్రి తుమ్మల అన్నారు.

## తిరుమలలో ఆర్జిత సేవలు

వాహన సేవలో కూడా పాల్గొనవచ్చని టీటీడీ ఈవో శ్యామలరావు తెలిపారు. ఆర్జీత సేవలు, ప్రత్యేక దర్శనాలను రద్దు చేసినట్టు ఆయన వెల్లడించారు. స్వయంగా వచ్చే వీఐపీలకు మాత్రమే దర్శనాలుంటాయని, గరుడసేవ రోజున అనగా అక్టోబర్ 08న వీఐపీ దర్శనాలు కూడా రద్దు చేసినట్టు తెలిపారు. బ్రహ్మోత్సవాల సమయంలో స్వామివారి దర్శనానికి వచ్చే సాధారణ భక్తులకు అధిక ప్రాధాన్యత కల్పించినట్టు చెప్పారు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాల నిమిత్తం ఆన్ లైన్ 1.32 లక్షల టికెట్లను ఇచ్చినట్టు వివరించారు. సర్వదర్శనానికి వచ్చే వారికి రోజుకు 24వేల దర్శనం టికెట్లను ఇవ్వనున్నట్టు స్పష్టం చేశారు. వాహన సేవలో రోజుకు 80వేల మంది భక్తులు పాల్గొంటారని, గరుడ సేవ రోజు లక్షమంది వరకు భక్తులు వస్తారని అంచనా వేసినట్టు ఈవో శ్యామల రావు వెల్లడించారు.

## రాష్ట్రంలో డీజేల మోత బంద్!

**హైదరాబాద్, అక్టోబరు 3 :**

రాష్ట్ర వ్యాప్తంగా వేడుకలు, బరాత్‌లు, ర్యాలీల్లో డీజే సౌండ్ సిస్టమ్‌ల వినియోగంపై నిషేధం అమలు కానుంది. డీజేల వినియోగంపై పదేళ్లుగా ఉన్న ఆంక్షలను కచ్చితంగా అమలు చేసేందుకు పోలీసు శాఖ సిద్ధమవుతోంది. డీజే లతో పెరుగుతున్న శబ్ద కాలుష్యం, మితిమీరిన చప్పుడుతో మనుషుల ఆరోగ్యంపై దుష్ప్రభావం తదితర కారణాలతో డీజే మోతలను ఆపాలని పోలీసు శాఖ నిర్ణయించింది. డీజేల వాడకం వల్ల తలెత్తే సమస్యలు, శాంతిభద్రతల పరంగా ఎదురయ్యే ఇబ్బందులు, నిషేధంపై తీసుకోవాల్సిన నిర్ణయానికి సంబంధించి పోలీసు శాఖ ప్రభుత్వానికి నివేదిక సమర్పించింది. ఆ నివేదిక పరిశీలన అనంతరం డీజేల వాడకంపై నిషేధానికి సంబంధించిన ఉత్తర్వులను ప్రభుత్వం జారీ చేయనుంది. నిబంధనల ప్రకారం నివాస సముదాయాలు ఉన్న ప్రాంతంలో పగటి పూట 55 డెసిబుల్స్, రాత్రి వేళ 45 డెసిబుల్స్ శబ్దం వరకు మాత్రమే అనుమతి ఉంటుంది. ఈ నిబంధనను ఇకపై కచ్చితంగా అమలు చేయనున్నారు. నిజానికి వినాయక చవితి అనంతరం అన్ని వర్గాల వారితో సమావేశమైన హైదరాబాద్ సీపీ సీవీ ఆనంద్.. హైదరాబాద్ కమిషనరేట్ పరిధిలో డీజేల వాడకంపై నిషేధం విధించారు. ఆ తర్వాత రాచకొండ, వరంగల్ కమిషనర్లు కూడా వేర్వేరుగా అదే తరహా ఉత్తర్వులు జారీ చేశారు. ఇప్పుడు భవిష్యత్తు పరిణామాలను దృష్టిలో పెట్టుకుని రాష్ట్రవ్యాప్తంగా నిషేధాన్ని అమలు చేయనున్నారు.

**ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం...**

డీజేలు ఉపయోగించడం వల్ల సాధారణంగానే 100150 డెసిబుల్స్ శబ్దం ఉత్పత్తి అవుతుంది. పరిమితికి మించిన శబ్దం ఆరోగ్యంపై తీవ్రప్రభావం చూపుతుంది. డీజే సౌండ్ సిస్టమ్స్ చప్పుళ్ల మధ్య డ్యాన్సులు చేస్తూ పలువురు ప్రాణాలు కోల్పోయిన ఘటనలు కూడా ఉన్నాయి. ఆరోగ్యంగా ఉన్న మనిషి 45 55 డెసిబుల్స్ శబ్దాన్ని భరించగలరు. అంతకుమించి శబ్దం వింటే అధిక రక్తపోటు, గుండెపనితీరు అదుపు తప్పడం, నాడీ వ్యవస్థపై ఒత్తిడి వంటి సమస్యలు తలెత్తుతాయని వైద్య నిపుణులు చెబుతున్నారు. డీజే శబ్దం వల్ల ఇతరులతో పోలిస్తే గర్భిణీలకు అధిక ముప్పు.

# అదనంగా క్వింటాలుకు రూ.500 బోనస్



**రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లాల్లో ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియ ఎలాంటి ఆటంకాలు లేకుండా సాఫీగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. రైతులకు ఇచ్చిన మాట ప్రకారం రాష్ట్ర ప్రభుత్వం ఈ సీజన్ నుంచే సన్నాలకు కనీస మద్దతు ధర MSP కు అదనంగా ఒక్కో క్వింటాలుకు రూ.500 బోనస్ చెల్లిస్తుందని స్పష్టం చేశారు.**

ఖరీఫ్ ధాన్యం సేకరణ ఏర్పాట్లపై పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఉన్నతాధికారులతో కలిసి ముఖ్యమంత్రి అన్ని జిల్లాల కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు, సీతక్క, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా పాల్గొన్నారు. ధాన్యం సేకరణకు సంబంధించి ముఖ్యమంత్రి అనేక సూచనలు చేశారు. ధాన్యం అమ్మిన రైతులకు 48 గంటల్లోపే వారి ఖాతాల్లో డబ్బులు జమ చేసేందుకు ప్రభుత్వం ప్రయత్నం చేస్తోంది. రాష్ట్ర వ్యాప్తంగా 7 వేలకుపైగా కొనుగోలు కేంద్రాలు నెలకొల్పగా, అవసరమైన చోట కలెక్టర్లు అదనపు కేంద్రాలను ఏర్పాటు చేయాలి. ప్రస్తుత సీజన్ లో 66.73 లక్షల ఎకరాల్లో వరి సాగు చేయగా, రికార్డు స్థాయిలో 140 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. సన్న వడ్లకు బోనస్ ఇవ్వటం ఇదే మొదటిసారి కాబట్టి తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. ఎక్కడా ఎలాంటి పొరపాట్లు, తప్పులు జరగకుండా జిల్లా కలెక్టర్లు బాధ్యత తీసుకోవాలి. ప్రతి కేంద్రానికి ఒక నెంబర్ కేటాయించి, ఆ కేంద్రంలో కొనుగోలు చేసిన వడ్ల సంచులపైన ఆ నెంబర్ తప్పకుండా వేయాలి. తాలు, తరుగు, తేమ పేరుతో రైతులను మోసం చేసే వారిని ఉపేక్షించరాదు. వ్యవసాయ శాఖ అధికారులు కూడా ధాన్యం సేకరణ ప్రక్రియలో పాల్గొనాలి. కొనుగోలు కేంద్రాల్లో గోనె సంచులు, టార్ఫాలిన్లు, మాయిశ్చర్ మిషన్లు, డ్రైయర్లు, ప్యాడీ క్లీనర్లు అందుబాటులో ఉండేలా ఏర్పాట్లు చేసుకోవాలి. సమస్యల పరిష్కారానికి పౌర సరఫరాల శాఖ విభాగంలో 24X7 కాల్ సెంటర్ ఏర్పాటు చేయాలి.

# విద్యార్థుల ఆనందాలు నింగిని తాకాయి

- అట్టహాసంగా వెస్ట్ మారేడుపల్లి కస్తూరిబా మహిళ డిగ్రీ కళాశాలలో బతుకమ్మ సంబరాలు
- మహిళలు బతుకమ్మ పండుగను ఆత్మ గౌరవంగా జరుపుకుంటారని కాలేజే యాజమాన్యం కితాబు

**జయభేరి, హైదరాబాద్ :**

తెలంగాణ ఆత్మగౌరవ పోరాటానికి ప్రతీకగా నిలిచేది బతుకమ్మ. రాక్షస పాలనలో తెలంగాణ మగువ ఆత్మ గౌరవాన్ని కాపాడుకోవటం కోసం పోరాట స్ఫూర్తితో తెగించి కొట్లాడిన ఆ జ్ఞాపకాలు ఈ చరిత్ర ఉన్నంత కాలం సజీవంగానే ఉంటాయి. అలాంటి ఆత్మగౌరవ పోరాటం తెలంగాణ నేలకే చెందుతుంది కాబట్టి ఈ నేలపైనే బతుకమ్మ పండుగను సంబరంగా జరుపుకుంటారు. నిజానికి బతుకమ్మ పండుగ జరుపుకోవాలంటే ఎంతో ధైర్యం ఓపిక చరిత్ర తెలిసి ఉండాలి. ఎందుకంటే ఆనాడు రాక్షస పాలనలో మానప్రాణాలు పోగొట్టుకున్న మహిళలు పోరాట స్ఫూర్తితో తెగించి పోరాటాన్ని కలిపి అడవుల్లో కనుమరుగైన ఆ చరిత్ర ఎన్నటికీ చెరిగిపోదు.

ఇలాంటి ఆత్మగౌరవ పోరాటానికి ప్రత్యేకగా నిలిచే బతుకమ్మ పండుగ బెస్ట్ మారేడు పెల్లి మహిళ కస్తూరిబా డిగ్రీ కళాశాలలో ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఇంటర్ డిగ్రీ విద్యార్థినిలు సంతోషంగా కొత్తబట్టలు ధరించి తీరక్క పువ్వులను బతుకమ్మగా పేర్చి ఆటపాటలతో కాలేజీలో బతుకమ్మ సంబరాలు నింగిని తాకాయి. ఈ సందర్భంగా కస్తూరిబా డిగ్రీ మహిళా కళాశాలలో సంబరాలను స్టూడెంట్ ఆర్గనైజేషన్.. ఆధ్వర్యంలో బతుకమ్మ సంబరాలు ఘనంగా జరిగాయి.





# ప్రహసనంగా మారిన వరద పరిహారం

## ఎన్టీఆర్ కలెక్టరేట్ ముట్టడి.. జాబితాలో పేర్లున్నా జమ కాని పరిహారం

- విజయవాడ వరదల్లో మునిగిన బాధితులకు పరిహారం చెల్లింపు ప్రహసనంగా మారింది. ఎవరికి పరిహారం చెల్లించారనే వివరాలను కూడా అధికారులు వెల్లడించక పోవడంతో బాధితులు గురువారం కలెక్టరేట్‌ను ముట్టడించారు. ఇప్పటికీ పెద్ద సంఖ్యలో బాధితులు పరిహారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నారు.

**జయభేరి, విజయవాడ :**



బుడమేరు వరద బాధితులకు పరిహారం అందించడంలో ఏపీ ప్రభుత్వ వైఫల్యాన్ని నిరసిస్తూ సీపీఎం ఆధ్వర్యంలో బాధితులు కలెక్టరేట్‌ను ముట్టడించారు. బాధితులు అందరికీ వరద సహాయం అందించాలని బాధితులు ధర్నా చేపట్టారు. వరద పరిహారం విడుదలై పది రోజులు గడుస్తున్నా బాధితులకు ఇప్పటి వరకు చెల్లింపులు పూర్తి కాలేదు. క్షేత్ర స్థాయిలో అన్యుమరేషన్ లోపభూయిష్టంగా సాగడంతో అర్హులైన బాధితులకు వరద సాయం అందకుండా పోయింది. ముఖ్యమంత్రి చివరి బాధితుడి వరకు నష్ట పరిహారం అందాలని పదేపదే చెబుతున్నా ప్రభుత్వ సిబ్బందిలో మాత్రం చలనం రావడం లేదు. దీంతో గురువారం వేలాదిమంది బాధితులు విజయవాడ ఎంజీ రోడ్డులోని ఎన్టీఆర్ జిల్లా కలెక్టరేట్ కు తరలి వచ్చారు. వరదలు వచ్చి 33 రోజులు గడిచినా వేలాది మంది బాధితులకు ఇంకా ఎలాంటి సహాయం అందలేదని ఆరోపించారు.

**రియల్ టైం గవర్నెన్స్ ఏమైంది?**

వరదల్లో జరిగిన నష్టానికి కేంద్ర ప్రభుత్వం 7వేల కోట్ల రూపాయల సహాయం వెంటనే ఇవ్వాలని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా 5వ తేదీ లోపు సహాయం అందించకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని సీపీఎం నేతలు హెచ్చరించారు. రియల్ టైం గవర్నెన్స్ గురించి మాట్లాడుతున్న కూటమి ప్రభుత్వం 33 రోజులు గడిచినా బాధితులు అందరికీ సహాయం అందించడంలో వైఫల్యం చెందిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికీ వేలాది మంది సహాయం అందక కార్యాలయాలు, ప్రజా ప్రతినిధుల చుట్టూ తిరుగుతున్నారని ఆరోపించారు.

ప్రభుత్వం మాత్రం బాధితులు 95 శాతం మందికి సహాయం అందించామని ప్రకటనలు చేయటం శోచనీయమని, అందరికీ సహాయం అందితే వేలమంది కార్యాలయాల వద్దకు వచ్చి దరఖాస్తులు ఎందుకు ఇస్తున్నారో ప్రభుత్వం ఆలోచించాలన్నారు. ప్రతి ఒక్క బాధితుడిని అన్ని విధాల ఆదుకుంటామని ముఖ్యమంత్రి ఇచ్చిన హామీని పూర్తిస్థాయిలో అమలు చేయాలని, ముందస్తుగా వరద హెచ్చరికలు చేయటంలో అధికార యంత్రాంగం పూర్తిగా విఫలమయ్యిందని, గత ప్రభుత్వం వరద ముంపు నివారణ చర్యలను నిర్లక్ష్యం చేసిందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వాన్ని ఏడు వేల కోట్ల రూపాయల వరద సహాయాన్ని ఇవ్వాలని కోరినా అన్ని రాష్ట్రాలకు ఇచ్చిన విధంగా అడ్వాన్స్ ఇచ్చి చేతులు దులుపుకుంటున్నదని, రాష్ట్రంలోని దాతలు, సంస్థలు 500 కోట్ల రూపాయలపైగా ప్రభుత్వానికి విరాళాల రూపంలో అంద చేశారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు తమ నిధుల నుండి బాధితులను ఆదుకోవటానికి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ప్రతి ఇంటిలో లక్ష నుండి పది లక్షల రూపాయలు పైగా నష్టం జరిగిందని, అత్యధికులు సర్వస్వం కోల్పోయారని, చిరు వ్యాపారులు, చిన్న, మధ్యతరగతి వ్యాపారులు, పరిశ్రమలు పూర్తిగా దెబ్బతినడంతో ఉపాధి లేకుండా పోయిందని వివరించారు. వరద అనంతరం ప్రభుత్వం కొన్ని చర్యలు వేగంగా తీసుకున్నా, దిగువ స్థాయికి సహాయం అందలేదని, ముఖ్యమంత్రి పర్యటించినా స్థానిక కూటమి ప్రజా ప్రతినిధులు పత్తా లేకుండా పోయారని, కూటమి నేతలు ప్రేక్షకపాత్ర వహిస్తున్నారని సీపీఎం నేతలు ఆరోపించారు.

విజయవాడ నగర పాలక సంస్థలో పాలక పక్షంగా ఉన్న వైసిపి ప్రజా ప్రతినిధులు చేతులెత్తేశారని, ప్రభుత్వం ప్రకటించిన విధంగా 5వ తేదీలోగా అందరికీ సహాయం అందించాలపి. కుటుంబాలకు ఆర్థిక సహాయం 50 వేలకు, ఆటోలకు 25 వేలకు, మోటార్ సైకిళ్లకు 10 వేల రూ"కు, చిరు వ్యాపారులకు 50 వేల నుండి లక్ష రూపాయలకు సహాయం పెంచాలని డిమాండ్ చేశారు. వరద బాధితుల నుండి విద్యుత్ ఛార్జీలను వసూలు చేయడం దారుణమని, ఇంటి పన్నులు కూడా మూడు నెలల్లో చెల్లించాలని ఆదేశాలు ఇవ్వటం గర్హనీయమని మండిపడ్డారు. పొదుపు సంఘాల బ్యాంకు రుణాలపై ప్రభుత్వం ప్రకటన చేయలేదని, బ్యాంకు అకౌంట్లలో తేడాల పేరుతో బాధితులను పది రోజుల నుండి బ్యాంకులు, కార్యాలయాల చుట్టూ తిప్పుతున్నారు. సమస్యకు పరిష్కారం చూడటం లేదు, బ్యాంక్ అకౌంటు లేని వారికి నేరుగా సహాయం అందించాలని సీపీఎం రాష్ట్రకార్యవర్గ సభ్యుడు చిగురుపాటి బాబురావు డిమాండ్ చేశారు.

# గజ్వేల్ పోలీస్ స్టేషన్లో మైనంపల్లి పై పిర్యాదు


- రాష్ట్ర మాజి ఎఫ్డిసి ప్రతాప్ రెడ్డి

**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 03 :**

గజ్వేల్ పట్టణంలోని ఆర్&ఆర్ కాలనీలో జరిగిన సమావేశంలో మాట్లాడుతూ మాజీ మంత్రి వర్యులు హరీష్ రావు, కేటీఆర్ ను అసభ్య పదజాలంతో దూశించిన మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హన్మాంతరావు మీద చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ గజ్వేల్ నియోజకవర్గ బారాస శ్రేణులు, ఇంచార్జి వంటేరు ప్రతాప్ రెడ్డి ఆధ్వర్యంలో గజ్వేల్ మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్ లతో కలిసి గజ్వేల్ పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ మైనంపల్లి మతి భ్రమించి నోటికి ఏది వస్తే అది మాట్లాడుతున్నారని తెలిపారు. ప్రజా జీవితంలో ప్రజల కష్ట,సుఖాల్లో భాగమై పనిచేస్తే ప్రజలు గుర్తిస్తారు తప్ప ఇలా నోటికి ఏది వస్తే అది మాట్లాడితే ప్రజలు హర్షించరని అన్నారు.మైనంపల్లి కేవలం మీడియాలో ప్రతినిధ్యం, అదిష్టానం మెప్పుకోసం మాత్రమే ఈ విధమైన చిల్లర మాటలు మాట్లాడతారని చెప్పారు. ప్రతిపక్ష పార్టీలోని పెద్ద నాయకులను తిట్టడం ద్వారా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దృష్టిలో పడవచ్చనే చిల్లర ప్రయత్నం మైనంపల్లి చేస్తున్నారని అన్నారు.

ఒక బాధ్యతయుతమైన ఎమ్మెల్యే పనిచేసిన వ్యక్తి ఇతర పార్టీ నాయకుల మీద పెట్రోల్ పోసి అంటిస్తానని కార్యకర్తల్ని రెచ్చగొట్టడం ఎంత వరకు సబబు అని ప్రశ్నించారు. గతంలో మైనంపల్లి నేరచరిత్ర కారణంగానే నగర భహిష్కరణకు గురి అయ్యారని గుర్తు చేశారు. ఇటువంటి నేర చరిత కల్గిన మైనంపల్లి వ్యాఖ్యలను సీరియస్ గా తీసుకొని తక్షణమే చట్టరీత్యా తగిన చర్యలను తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జకియొద్దిన్, మాజీ జడ్పీటీసీ పంగ మల్లేశం, మండల పార్టీ అధ్యక్షులు బెండె మధు, కౌన్సిలర్లు మెట్టయ్య, బబ్బూరి రజిత, చందు నాయకులు మద్దూరి శ్రీనివాస్ రెడ్డి, దయాకర్ రెడ్డి, బొల్లారం ఎల్లయ్య, గుంటుకు రాజు, ఆర్ కె శ్రీనివాస్, కల్యాంకర్ శ్రీనివాస్ రమేష్,ఉమర్, నిజాం,హన్మంతరెడ్డి, శివకుమార్, నాగులు,ఎల్లం తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా ప్రారంభమైన దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు

- మొదటి రోజు బాల త్రిపుర సుందరి దేవిగా దర్శనమిచ్చిన అమ్మవారు

**జయభేరి, అక్టోబర్ 3:**

మేడ్చల్ జిల్లా తుంకుంట మున్సిపాలిటీ పరిధిలోని గాయత్రి మహా క్షేత్రంలో దేవి శరన్నవరాత్రి ఉత్సవాలు ఘనంగా ప్రారంభయ్యాయి. ఆలయ వ్యవస్థాపకులు డాక్టర్ ఎస్.వి.ఎల్. ఎన్ .మూర్తి ఆధ్వర్యంలో ఉత్సవాలు నిర్వహించగా మొదటి రోజు అమ్మవారిని బాలత్రిపురసుందరి దేవిగా అలంకరించారు. ఈ నెల 3 నుంచి 12 వరకు ఈ నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తామని ఆయన తెలిపారు. అదేవిధంగా 4న శుక్రవారం కంచి కామాక్షిదేవిగా, 5న శనివారం మధుర మీనాక్షి దేవిగా, 6న ఆదివారం మహాలక్ష్మి దేవిగా, 7న సోమవారం వనదుర్గదేవిగా, 8న మంగళవారం అన్నపూర్ణ దేవి గా, 9న బుధవారం సరస్వతి దేవిగా, 10 గురువారం కనకదుర్గ దేవిగా, 11న శుక్రవారం రాజరాజేశ్వరి దేవిగా, 12న శనివారం చివరి రోజు అమ్మవారి నిజ రూపంలో భక్తులకు దర్శనం కల్పించనున్నట్లు అయన తెలిపారు. ఈ నవరాత్రి ఉత్సవాలలో భాగంగా ఉదయం శ్రీగాయత్రీ అమ్మవారికి ఉపనిషత్పూర్వక అభిషేకం, మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మధ్యాహ్నం 3.30 గంటల నుండి చండీ హోమము, సాయంత్రం శ్రీలలితా సహస్రనామస్తోత్ర పారాయణం, శ్రీసూక్త పారాయణం, వేద స్వస్తి, దేవి భాగవత ప్రవచనాలు ఇత్యాది కార్యక్రమాలు ఉంటాయని ఆయన తెలిపారు. అదేవిధంగా అక్టోబర్ 12వ తేదీన విజయ దశమి సందర్భంగా అమ్మవారికి అభిషేకం, నిజ రూపదర్శనం, వాహన పూజలు, శమీ పూజ నిర్వహించినట్లు తెలిపారు. ఈ వేడుకలకు భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారి కృపకు పాత్రులు కావాలని కోరారు.



## బాల త్రిపురదేవిగా అమ్మవారు

- విశేష సంఖ్యలో క్షేత్రానికి వచ్చిన భక్తులు

**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 03 :**

ప్రసిద్ధ వర్గల్ శ్రీ విద్యాధరి క్షేత్ర శరన్నవరాత్ర మహోత్సవాల సందర్భంగా గురువారం ఆలయ వ్యవస్థాపక చైర్మన్, బ్రహ్మశ్రీ యాయవరం చంద్రశేఖర శర్మ సిద్ధాంతి నేతృత్వంలో ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది. ఈ సందర్భంగా వేద పండితుల మంత్రోశ్చరణల మధ్య గణపతి పూజ, పుణ్యాహవచనము, మహాభిషేకము, కలశస్థాపన, చతుషష్ట్యు పచార పూజలు, మూలమంత్ర హవనము, చండీహోమము తదితర కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు. ఈ పర్వదినాలను పురస్కరించుకొని శ్రీ లక్ష్మీ గణపతి, శ్రీ శనైశ్చర, శ్రీ వల్లి దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర, శ్రీ కళ్యాణ వెంకటేశ్వర , శ్రీ చంద్రమౌళీశ్వర స్వామి క్షేత్రాలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. విశేష సంఖ్యలో తరలివచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించగా, అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో వారికి తీర్థ ప్రసాదాలతో పాటు మహా ప్రసాదం అందజేశారు. కాగా ఈరోజు అమ్మవారు బాల త్రిపుర సుందరి దేవి అవతారంలో భక్తులకు దర్శన భాగ్యం కల్పించారు.



# బస్టాండ్ కి కూతవేటు దూరంలో భారీ అక్రమ నిర్మాణం

- అధికారులకు మెయిన్ రోడ్డులో అక్రమ కమర్షియల్ నిర్మాణం కనిపించట్లేదా..?

**జయభేరి, ఘట్కేసర్, అక్టోబర్ 3:**

మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఘట్కేసర్ బస్టాండ్ కి కూతవేటు దూరంలో ఘట్కేసర్ మున్సిపాలిటి 13వ వార్డులో మెయిన్ రోడ్డు ప్రక్కనే అనుమతి లేని అక్రమ భారీ కమర్షియల్ నిర్మాణం జరుగుతుంది. ఈ అక్రమ కమర్షియల్ నిర్మాణానికి స్వయంగా మున్సిపాలిటీ అధికారులే సహకరిస్తున్నారని అక్కడి ప్రజల నుంచి తీవ్ర విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఇలాంటి అక్రమ నిర్మాణాల పై చర్యలు తీసుకోవాల్సిన మున్సిపాలిటీ అధికారులే భారీగా ముడుపులు అందుకుంటూ, మున్సిపాలిటీ ఆదాయానికి భారీగా గండి కొడుతూ అక్రమ నిర్మాణదారులకు సహకరిస్తున్నారని గుసగుసలాడుతున్నారు. ఒక మామూలు పేదవాడు చిన్న ఇల్లు నిర్మించుకుంటుంటే ఎలాంటి నోటీసులు లేకుండా ఎలాంటి ముందస్తు సమాచారం ఇవ్వకుండా నేలమట్టం చేసే అధికారులకు మెయిన్ రోడ్డులో ఇంత పెద్ద అక్రమ కమర్షియల్ నిర్మాణం కనిపించట్లేదా..? ఘట్కేసర్ మున్సిపాలిటీలో పేదవాడికి ఓ న్యాయం బడా బాబులకు ఓ న్యాయమా అంటూ మండిపడుతున్న ప్రజలు. ఇప్పటికైనా బడాబాబులు ఇచ్చే కాసులకు ఆశపడకుండా, మున్సిపాలిటీ ఆదాయానికి గండి పడకుండా, ఇలాంటి అక్రమ నిర్మాణాలకు సహకరించకుండా వెంటనే తగు చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్న ప్రజలు.





# మల్లేషా.. ఏంటి తమాషా...!?


## అంతా నువ్వే చూసుకుంటే ఎట్లా...!?

- అక్రమ నిర్మాణాలకు అనుమతులు నీ ఇష్టమేనా.!
- నాగారం మున్సిపాలిటీలో కాసులు దండుకుంటున్న టౌన్ ప్లానింగ్ అధికారులు!?
- ఆర్ ఎల్ నగర్ 408 ప్లాట్ 2 లో అక్రమ నిర్మాణం సంగతి ఏమిటి..!?

**జయభేరి, మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా :**

బాల మల్లేశా నీ మనసుకు ఏది అనిపిస్తే అదే చేస్తావా!? అనే మండిపడుతున్నారు స్థానిక జనాలు... దోచుకున్నోడికి దోచుకున్నంత..!? అనే చందంగా మారిందనీ నాగారం మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారుల పనితీరు అద్దం పడుతుందంటున్నారు అవినీతి పుస్తకాల్లోనే ఉంటాయి కానీ వీళ్ళకి మాత్రం వర్తించవు. మున్సిపాలిటీ పరిధిలోని ఆర్ ఎల్ నగర్ మెయిన్ రోడ్డులో బహుళ అంతస్తుల నిర్మాణం ఈ టౌన్ ప్లానింగ్ అధికారుల విధులకు మంచి ఉదాహరణగా మారుతుంది. నగరం మున్సిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారులు అక్రమ నిర్మాణదారులకు చేతులు కలుపుతూ వారికి అండగా ఉంటూ భారీగా ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. మనలో మనం మాట్లాడుకుంటే సరిపోతుంది కదా అనే కాబోలు...!?

ఆర్ఎల్ నగర్ కాలనీలోని సర్వే నెంబర్ 48 పార్టీ ప్లాట్ నెంబర్ రెండులో చేపడుతున్న నిర్మాణ విస్తీర్ణం 148 గజాలలో అనుమతులు మాత్రం రెండింటికే తీసుకుని అదనపు అంతస్తు నిర్మాణం చేపడుతున్నారు.!? ఈ బిల్డింగ్ నిర్మాణానికి తీసుకున్న అనుమతులు జి ప్లస్ టు పర్మిషన్ తీసుకుని ఏకంగా అదనపు అంతస్తుల భవనం నిర్మించడం వెనుక సదరు ఈ దొరగారి పాత్ర ఉన్నట్టుగా కనిపిస్తోంది. ఈ అక్రమ నిర్మాణ దారుడికి స్థానిక టౌన్ ప్లానింగ్ అధికారులు వత్తాసు పలుకుతున్నారనే విమర్శలు గట్టిగా వినపడుతున్నాయి. ఇదిలా ఉంటే నాగారం మున్సిపాలిటీ పరిధిలో ఇల్లు కట్టాలంటే టీఎస్ బీ పాస్ అవసరమే లేదు అన్నట్టుగా ఉంది. కానీ స్థానికంగా ఉన్న అధికారులని కాస్త చేయి తడిపితే చాలు అని స్థానిక బిల్డర్లు గగ్గోలు పెడుతున్నారు. ఈ అక్రమ నిర్మాణాలపై వెంటనే నూతనంగా వచ్చిన నాగారం మున్సిపాలిటీ కమిషనర్ తగిన చర్య తీసుకోవాలని అందుకు తగ్గట్టు విచారణ మొదలు పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికే 70% నిర్మాణాలకు అనుమతులు లేకుండా ఉన్నాయి. అని అంటూ స్థానిక మున్సిపల్ కార్యాలయంలో టౌన్ ప్లానింగ్ అధికారులు తమ కాసుల కక్కుర్తి కోసం చట్టాలను సైతం తుంగలో తొక్కేసి అందిన కాడికి దోచుకుంటూ ధనార్జన ధ్యేయంగా తమ విధులను నిర్వహిస్తున్నారు టౌన్ ప్లానింగ్ అధికారులు. ఇన్చార్జి మున్సిపల్ కమిషనర్ వెంటనే స్పందించి తమ పరిధిలోని అక్రమ నిర్మాణాలపై వెంటనే చర్యలు తీసుకోవాలని అక్రమ నిర్మాణదారులకు బుద్ధి వచ్చేలా కఠిన చర్యలు తీసుకోవాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు.






## మెడిసిటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం

- పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించిన వైద్యులు
- వైద్య శిబిరానికి ప్రజల నుంచి అనూహ్య స్పందన




**జయభేరి, అక్టోబర్ 3:**

మేడ్చల్ జిల్లా శామీర్ పేట్ మండలం కేశవరం గ్రామంలో మెడిసిటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు.ఈ వైద్య శిబిరంలో భాగంగా పలువురికి బీపీ, షుగర్ మరియు కంటి పరీక్షలతో పాటు,చెవి,ముక్కు ,గొంతు, వరిబీజం తదితర పరీక్షలు నిర్వహించారు. అదేవిదంగా అవసరమైన వారికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేశారు. ఇక చర్మ సమస్యలు, మోకాళ్ళ నొప్పులు, నడుము నొప్పులు, ఊపిరితిత్తుల సమస్యలు చూసి మందులు ఉచితంగా పంపిణీ చేశారు. కాగా ఈ వైద్య శిబిరంలో భాగంగా సుమారు 122 మందికి వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఆపరేషన్ అవసరమైన 22 మందిని మెడిసిటీ హాస్పిటల్ కు తరలించి ఉచిత ఆపరేషన్లు చేయిస్తామని వైద్యులు వెల్లడించారు. ఈ వైద్య శిభిరంలో గ్రామ ప్రజలు, వైద్యులు ఒమార్ ,జాహ్నవి ,అజయ్ , సాహితి ,జయతి , మార్కెటింగ్ ఇంచార్జి కుమారస్వామి, శేఖర్ బాబు ,రఘు , సాయి,హన్న తదితరులు పాల్గొన్నారు.

## వారి పని బోరు మోటర్లు, కరెంటు వైర్ల దొంగతనం




**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 03 :**

బోరు బావుల వద్ద బోరు మోటర్లు, కరెంటు వైర్లు, ఇనుప సామాన్లు దొంగతనం చేసే ఇద్దరి నిందితులను అరెస్టు చేసినట్లు కుకునూరుపల్లి ఎస్ఐ తెలిపారు. ఎస్ఐ శ్రీనివాస్ వివరాలు.. దుబ్బాకకు చెందిన నర్సింలు, ఎల్లయ్యలు కూలీ పని చేస్తూ జల్సాలకు అలవాటు పడి దొంగతనాలకు పాల్పడ్డారన్నారు. వారి వద్ద నుండి రూ.36 వేల నగదు స్వాధీనం చేసుకుని, దొంగతనానికి ఉపయోగించిన ఆటోను సీజ్ చేసి, నిందితులను రిమాండ్కు పంపామని తెలిపారు

## సొంతూళ్ళకు వెళ్ళే వారికి పోలీసుల జాగ్రత్తలు

- విలువైన వస్తువులను ఇంట్లో ఉంచుకోవద్దని సూచన
- అనుమానాస్పద వ్యక్తులపై సమాచారం అందించాలన్న : సీఐ శ్రీనాథ్




**జయభేరి, అక్టోబర్ 3:**

దసరా పండగ నేపథ్యంలో సొంత ఊళ్లకు వెళ్ళే వాళ్ళు తగు జాగ్రత్తలు తీసుకోవాలని శామీర్ పేట్ పోలీసులు సూచించారు. ప్రజలు తమ విలువైన వస్తువులను ఇంట్లో ఉంచకుండా బ్యాంక్ లాకర్లలో భద్రపరుచుకోవాలని సూచించారు. అదేవిధంగా సెక్యూరిటీ అలారం, సెన్సార్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. కాలనీలలో ఎవరైనా అనుమానాస్పద వ్యక్తులు సంచరించినట్లయితే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. అంతేకాక నమ్మకస్తులైన సెక్యూరిటీ గార్డ్ ను నియమించుకోవాలన్నారు. ముఖ్యంగా ఇంట్లో అమర్చిన సీసీ కెమరాలను పర్యవేక్షించాలన్నారు. బయటకు వెళ్ళే వారు ఎట్టి పరిస్థితుల్లోనూ మీడియాలో షేర్ చేసుకోకూడదని సూచించారు. ఎవరి మీద నైన అనుమానం కలిగితే టోల్ ఫ్రీ నంబర్ 100, లేదా సైబరాబాద్ పోలీస్ కంట్రోల్ రూమ్ 9490617100, లేదా వాట్సాప్ నంబర్ 9490617444 , శామీర్ పేట పోలీస్ స్టేషన్ 9490617142, 9490617231 నంబర్ లకు సమాచారం అందించాలని సూచించారు.

# బిఆర్ఎస్, బిజెపి గల్లీలో కుస్తీ- ఢిల్లీలో దోస్తీ...!

- మొన్న ఎంపీ ఎలక్షన్లలో బిజెపి బిఆర్ఎస్ చీకటి ఒప్పందం..
- గజ్వేల్ మార్కెట్ కమిటి ప్రమాణస్వీకారంలో పాల్గొన్న మంత్రులు.
- మార్కెట్ పాలకమండలి సభ్యులకు కలిసికట్టుగా పని చేయాలంటూ సూచన.

**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 03 :**

పదవి ఆంక్షతో ఉన్న కేటీఆర్ కేసీఆర్ నీ లోపల బొండిగా పిసికి సంపిండనే అనుమానం వస్తుందని, దేవాదాయ అటవీ శాఖమంత్రి కొండసురేఖ అన్నారు. అందుకే కేసీఆర్ కన్పించడం లేదేమోనని ఆమె అనుమానం వ్యక్తం చేశారు. ప్రభుత్వం పై కేటీఆర్ తప్పుడు ప్రచారాలు చేస్తే ఊరుకోబోమని సురేఖ ఆమె హెచ్చరించారు.సిద్ధిపేట జిల్లా గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ అధ్యక్షుడిగా వంటేరు నరేందర్ రెడ్డి, ఉపాధ్యక్షుడిగా సర్దార్ ఖాన్ లు ప్రమాణస్వీరమహోత్సవానికి మంత్రులు తుమ్మల నాగేశ్వర్ రావు,కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్ లు హాజరయ్యారు. ఈ సందర్భంగా కొండా సురేఖ మాట్లాడుతూ బిజెపి బీఆరెస్ చీకటి ఒప్పందలతోనే కవితకు బెయిలు వచ్చిందని ఆమె పేర్కొన్నారు.అందులో భాగంగానే బీఆరెస్ తాను గెలువకపోయిన పర్వాలేదు కానీ బిజెపి గెలువలనే లక్ష్యంతో 7 ఎంపీ స్థానాల్లో బిజెపి మద్దతు ఇచ్చిందని సురేఖ తెలిపారు. మూసి





ప్రక్షాళన కోసం యత్నించింది బీఆరెస్ , ఆచరిస్తోంది కాంగ్రెస్ అని చెప్పారు.కాంగ్రెస్ ప్రభుత్వంపై హైడ్రా, మూసి ప్రక్షాళనలతో ప్రజల్లో అపోహలు లేపి సోషల్ మీడియాతో అసత్యపు ప్రచారాలు చేస్తే ఉరోబోము కేటీఆర్ అని ఆమె హెచ్చరించారు. రోజుల్లో 18 గంటలు పనిచేస్తూ ప్రజలకు మేలుచేసేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారని ఆమె భరోసానిచ్చారు . మంత్రి తుమ్మల నాగేశ్వర్ మాట్లాడుతూ మాజీ ముఖ్యమంత్రి రాజశేఖర్ రెడ్డి చేసిన విధంగా వ్యవసాయాన్ని యాంత్రీకరణ చేస్తామని చెప్పారు. ఆయిల్ ఫామ్,అర్తికల్చర్, వ్యవసాయ విధానంలో సిద్దిపేటను దేశంలోనే అగ్రగామిగా తీర్చిదిద్దుతామని మంత్రి అన్నారు. వరంగల్లో వరదలు వచ్చి 10వేల కోట్ల సంక్షోభం ఏర్పడితే కేంద్రం ఉట్టి 4వందల కోట్ల రూపాయలు ఇచ్చి చేతులు దులుపుకొందన్నారు. బీఆరేస్ కి తెలంగాణ రైతన్నపట్ల చిత్తశుద్ధి ఉంటే మంచి చేసే ప్రభుత్వానికి కాళ్ళల్లో కట్టే విధంగా చేయడం మానుకోవాలని సూచించారు. పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ బీజేపీ బిఆరెస్ లు గల్లీలో కుస్తీ, డిల్లీలో దోస్తానా చేస్తున్నాయని పేర్కొన్నారు. నల్ల చట్టాలకు వ్యతిరేకంగా బిజెపికి, బీఆరెస్ లు ఒప్పందాలపై సంతకాలు చేశాయని గుర్తు చేశారు.

---



## ప్రారంభమైన దేవి శరన్నవరాత్రులు

- అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన ఎంపీ ఈటల

**జయభేరి, మేడ్చల్ :**

గండ్లపోచంపల్లి మున్సిపాలిటీతో పాటు మేడ్చల్ మండలంలోని గ్రామాల్లో దేవి శరన్నవరాత్రులు ఘనంగా ప్రారంభమయ్యాయి. నవరాత్రుల సందర్భంగా ఆలయాలను విద్యుత్ దీపాలతో అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గుండ్లపోచంపల్లి,పలు గ్రామాల్లో ప్రత్యేక మండపాలను ఏర్పాటు చేసి అమ్మవారిని నెలకొల్పారు. నవరాత్రుల్లో అమ్మవారు తొమ్మిది రోజులు తొమ్మిది అవతారాలలో దర్శనమియ్యనున్నారు. మొదటి రోజు అమ్మవారు బాలత్రిపుర సుందరి దేవి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ ఆవరణలో నిర్వహించిన దుర్గాదేవి పూజల్లో మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నవరాత్రి పూజల్లో మొదటి అవడంతో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు విక్రమ్ రెడ్డి, అసెంబ్లీ కన్వీనర్ అమరం మోహన్ రెడ్డి, కౌన్సిలర్ సరస్వతి, దొడ్ల మల్లికార్జున్, అమరం హేమంత్ రెడ్డి, భేరి బాలరాజు, మాజీ సర్పంచ్ మద్దుల శ్రీనివాస్ రెడ్డి, భేరి ఈశ్వర్, పలువురు గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

---

## మృతుని కుటుంబానికి ఆర్థిక సాయం



**గజ్వేల్, అక్టోబర్ 03 :**

ములుగు మండల కేంద్రంనికి చెందిన డాకోజి వెంకట చారి బుధవారం రాత్రి ఆకస్మికంగా గుండెపోటు రావడంతో మృతి చెందాడు.విషయం తెలుసుకున్న మెదక్ డిసిసిబి డైరెక్టర్ బట్టు అంజిరెడ్డి పదివేల రూపాయలను ఆర్థిక సహాయంగా అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్థులు పాల్గొన్నారు.

---

## ఫ్యామిలీ డిజిటల్ కార్డ్స్ సర్వే ప్రాజెక్ట్ ప్రారంభం




**జయభేరి, దేవరకొండ :**

పురపాలక సంఘం నందు ఫ్యామిలీ డిజిటల్ కార్డు కొరకు (పైలట్ ప్రాజెక్ట్) క్రింద ఎంపిక చేసిన 20 వ వార్డు నందు సంబంధిత అధికారులు సర్వే నిర్వహించారు .ఈ సర్వేలో ప్రతి కుటుంబానికి ఫ్యామిలీ డిజిటల్ కార్డు ఇవ్వడం జరుగుతుందని ఆర్డిఓ శ్రీరాములు తెలిపారు. అర్హులైన వారందరూ ఒకే కార్డు ద్వారా ఈ సేవలు పొందడానికి వీలుగా ఫ్యామిలీ డిజిటల్ కార్డు ప్రభుత్వం అందజేస్తుందని ,సంక్షేమ పథకాలకు ఇతర అవసరాలకు అన్నింటికీ ఒకే గొడుగు కింద తీసుకువస్తూ ప్రతి ఒక్కరికి ఫ్యామిలీ డిజిటల్ కార్డులను అందజేయడానికి ప్రభుత్వం సిద్ధమవుతుందని మున్సిపల్ కమిషనర్ భాస్కర్ రెడ్డి అన్నారు. ఇట్టి సర్వే 07 వరకు అయిదు రోజుల్లో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ఇట్టి సర్వేను రెండు టీమ్ లుగా ఏర్పాటు చేసి ప్రతి రోజు 30 ఇండ్లను కవర్ చేసి సర్వే చేయడం జరుగుతుందని అన్నారు. అదేవిధంగా 20 వ వార్డు ప్రజలు అందుబాటులో ఉంది అధికారులకు సహకరించవలసినదిగా కోరారు. ఇట్టి సర్వేలో మునిసిపల్ అసిస్టెంట్ ఇంజనీర్ రాజు, తహసీల్దార్ సంతోష్ కుమార్, మునిసిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

---

## జల్సా ఏ సీరతున్ నబి



**దేవరకొండ :**

దేవరకొండ ఈద్గా కమిటీ మరియు మదర్సా మిస్బా ఉల్ ఉలుమ్ ఆధ్వర్యంలో 34వ (జల్సా ఏ సీరతున్ నబి 2024) కార్యక్రమం. ఈ నెల 14న నగరంలోని స్థానిక అఖ్సా మస్జిద్ లో నిర్వహిస్తున్నట్లు దేవరకొండ ముఫ్తి మహ్మద్ జావిద్ హుస్సేన్, ఈద్గా కమిటీ అధ్యక్షులు సయ్యద్ అజీమోద్దీన్ పేర్కొన్నారు. బుధవారం స్థానిక మక్కా మస్జిద్ లో జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ...గత 33 సంవత్సరాలుగా జల్సా ఏ సీరతున్ నబి కార్యక్రమం నిర్వహిస్తున్నామని ఈ యేడాది 34వ జల్సా ఈ నెల 14వ తేదీన నిర్వహిస్తున్నామని ఈ కార్యక్రమానికి నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల మంది ముస్లిం సోదర, సోదరీమణులు ప్రజలు పాల్గొంటారని అన్నారు. హైదరాబాద్ తో పాటు ఇతర రాష్ట్రాల నుండి ముఖ్య అతిధులు.. మత పెద్దలు హాజరై మహ్మద్ ప్రవక్త జీవిత చరిత్ర.. ప్రపంచ శాంతి అంశాలపై ప్రసంగిస్తారని తెలిపారు. ఈ నెల 14న సోమవారం సాయంత్రం 6 గంటల నుండి రాత్రి 11 గంటల వరకు ఈ కార్యక్రమం కోసాగుతుంది అన్నారు.. అదేవిధంగా జల్సాకు విచ్చేయు ప్రతి ఒక్కరికీ భోజన ఏర్పాట్లు చేయనున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో 40 మంది వాలంటీర్లు పని చేస్తారని.. మహిళలకు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. జల్సాకు తోడ్పాటు అందిస్తున్న ప్రతి ఒక్కరికీ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సమావేశంలో కమిటీ ప్రధాన కార్యదర్శి యండి ఇలియస్ పటేల్, గౌరవ అధ్యక్షులు మహ్మద్ షబ్బీర్ అహ్మద్, ఉపాధ్యక్షులు మహ్మద్ సాలర్ ఖదీర్.. మహ్మద్ షబ్బీర్, సభ్యులు. ఖాజా మైనోద్దీన్, మహ్మద్ సలీం, మహ్మద్ అఫ్రోజ్, జాఫర్ ఖాన్, సయ్యద్ జామిన్ అలీ, సయ్యద్ దస్తగిర్, యస్ కె బురాన్, యండి ముజీబ్, అజ్మత్, సయ్యద్ అజీజోద్దీన్, హమీద్, నజీర్, మహ్మద్ షఫీ, ఇస్మాయిల్, షాహ్బాజ్, ఖైసర్, ఇల్యాస్ బాబా, సయ్యద్ మంజూర్ తదితరులు పాల్గొన్నారు.

---

## బోడుప్పల్ కార్పొరేషన్ కు ప్రత్యేక నిధులు ఇవ్వండి

- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి బోడుప్పల్ మేయర్ వినతి

**జయభేరి, మేడిపల్లి :**



బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం ప్రత్యేక నిధులు మంజూరు చేయాలని కోరుతూ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిసి కోరారు. ఈ మేరకు గురువారం నాడు ముఖ్యమంత్రి నివాసంలో శాసన మండలి విప్ పట్నం మహేందర్ రెడ్డి,టీ.పీసీసీ ఉపాధ్యక్షుడు తోటకూర వజ్రేష్ యాదవ్, మాజీ ఎమ్మెల్యే మలిపెద్ది సుధీర్ రెడ్డి, డీసీసీ అధ్యక్షుడు హరివర్ధన్ రెడ్డిలతో కలిసి బోడుప్పల్ కార్పొరేషన్ అభివృద్ధి కోసం కావాల్సిన నిధుల కోసం విజ్ఞప్తి చేశారు. బోడుప్పల్ కార్పొరేషన్ లో ప్రధాన సమస్యలైన ఎస్ఎన్డిపీ ప్రాజెక్టును పూర్తి చేసి ముంపు ప్రాంతాల సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు. అదే విధంగా బోడుప్పల్ కార్పొరేషన్ పరిధిలోని దళితులకు చెందిన అసైండ్ భూములకు పరిష్కారం చూపి వారికి న్యాయం చేసేలా చోరవ చూపాలని కోరినట్లు ఆయన తెలిపారు. అదే విధంగా గత కొన్ని సంవత్సరాలుగా బోడుప్పల్ పది వేల కుటుంబాలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్య అయిన వక్ఫ్ భూమి సమస్యకు పరిష్కారం చూపి అక్కడి ప్రజలకు న్యాయం చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరారు.

---

## గ్రూపు 4 పరీక్ష ఫలితాలు ప్రకటించాలి

- గాంధీ భవన్ ముట్టడికి యత్నించిన అభ్యర్థులు..!!

**జయభేరి, హైదరాబాద్ :**




తెలంగాణలో గ్రూపు 4 పరీక్ష ఫైనల్ ఫలితాలు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ.. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్, గాంధీ భవన్ ముట్టడికి గ్రూపు 4 అభ్యర్థులు ప్రయత్నించారు. సర్టిఫికేట్ వెరిఫికేషన్ పూర్తయి రెండు నెలలు అయినా ఇప్పటికీ ఉద్యోగాలు కేటాయించలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని.. తాము నిర్లక్ష్యం చేయకుండా త్వరగా పూర్తి చేస్తున్నామని సీఎం రేవంత్ రెడ్డి ఇటీవలే ప్రకటించారు. తాజాగా గాంధీభవన్ ముట్టడికి పెద్ద ఎత్తున తరలివచ్చిన అభ్యర్థులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ సందర్భంగా అభ్యర్థులు మీడియాతో మాట్లాడుతూ.. గ్రూప్ ఫోర్ ఎగ్జామ్ రాసి 460 రోజులు అవుతుందని.. సర్టిఫికేట్ వెరిఫికేషన్ కూడా అయ్యిందని అభ్యర్థులు తెలిపారు. డీఎస్సీ పోస్టులకు 56 రోజుల్లో పూర్తిచేసిన టీజీపీఎస్సీ అధికారులు.. ఎనిమిది వేల గ్రూప్ ఫోర్ పోస్టులకు 460 రోజులు ఎలా సమయం పడుతుంది అని ప్రశ్నించారు.వెంటనే ఇతర ప్రక్రియలు పూర్తిచేసి ఈ దసరా పండుగ వరకు గ్రూప్ 4 తుది ఫలితాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు అభ్యర్థులు.

---

## మూసి నదిని అడ్డం పెట్టుకొని ఎన్ని రోజులు బతుకుతార్రా?

- సీఎం రేవంత్ రెడ్డి

**జయభేరి, హైదరాబాద్, అక్టోబర్ 03 :**



హైడ్రా మీద అసెంబ్లీలో చర్చ పెడితే బిఆర్ఎస్ వాళ్లు ఎవరు రాలేదని దుయ్యబట్టారు. ఆరోజు కనీసం సూచనలు కూడా చేయలేదన్నారు. మూసీ నదిని అడ్డం పెట్టుకుని టిఆర్ఎస్ నాయకులు ఎన్ని రోజులు బతుకుతార్రా? మీ ఫామ్ హౌస్ లను ఎన్ని రోజులు కాపాడుకుంటార్రా? ఒక్కొక్కడిని చింతపండు చేస్తానని టిఆర్ఎస్ నాయకులను ఉద్దేశించి సీఎం రేవంత్ రెడ్డి, హెచ్చరించారు.

మూసీ నిర్వాసితులను ఎలా ఆదుకోవాలో చర్చించేందుకు కేటీఆర్, హరీష్ రావులు సచివాల యానికి రావాలని కోరారు. పేదల కోసం ఏదైనా చేయడానికి మా ప్రభుత్వం సిద్ధంగా ఉందన్నారు. గుజరాత్ లో సబర్మతి రివర్ ఫ్రంట్ కావాలి కానీ, తెలంగాణలో మూసీ రివర్ ఫ్రంట్ అవసరం లేదా? అని సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ ను ప్రశ్నించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ లో గురువారం నాడు కుటుంబ డిజిటల్ హెల్త్ కార్డుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. కేటీఆర్, హరీష్ రావు, సవిత ఇంద్రారెడ్డి, ఫామ్ హౌస్ లు కూల్చాలా? వద్దా? అని ఆయన అడిగారు. సబితా ఇంద్రా రెడ్డి పేద అరుపులు మానుకోవాలని ఆయన సూచించారు.

---




## అధికారంతో అడ్డగోలు మాటలు..!

**జయభేరి, గజ్వేల్, అక్టోబర్ 03 :**

కాంగ్రెస్ నాయకులు అధికారం ఉన్నదని ఇష్టం వచ్చినట్టు మాట్లాడితే ఊరుకోబోమని రాష్ట్ర యూత్ వింగ్ మెంబర్ జుబేర్ హెచ్చరించారు.మంత్రి కొండా సురేఖ నోటికి అదుపు లేకుండా ఏవేవో మాట్లాడుతూ ప్రజలను అయోమయానికి గురిచేస్తుందన్నారు. బిజెపికి ఏడు సీట్లు వస్తాయని గజ్వేల్,సిద్దిపేట బిజెపికి సహకరించి ఉంటదన్నారు.గజ్వేల్ లో కాంగ్రెస్ రెండో స్థానంలో ఉన్న విషయం కూడా ఆమెకు తెలవదున్నారు. రాష్ట్ర మంత్రి అయి ఉండి ఏ పార్టీకి ఎన్ని ఎంపీ సీట్లు వచ్చినాయో కూడా తెలవకుండా మాట్లాడడం ఆమె రాజకీయ అవగాహన ఎంతవరకు ఉందో ప్రజలందరూ గమనించారని ఇలాంటి నాయకులకు మంత్రి పదవులు ఇచ్చి తెలంగాణ రాష్ట్ర ప్రజలను అయోమయానికి గురి చేస్తూదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు ఆత్మ విమర్శ చేసుకొని లేని పక్షంలో నాయకులను తక్షణం మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాలని రాష్ట్ర యూత్ వింగ్ మెంబర్ జూబేర్ డిమాండ్ చేశారు.

---

## అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి



**జయభేరి, దేవరకొండ :**

పట్టణంలో బుధవారం రాత్రి ఓ వ్యక్తి అనుమాదాస్పద స్థితిలో మృతి చెందాడు. మండల కేంద్రంలోని కొమ్మేపల్లి గ్రామానికి చెందిన అంకూరి బుచ్చయ్య (34) పట్టణంలోని తాను పనిచేసే రెస్టారెంట్లో మృతి చెంది ఉండగా గురువారం స్థానికులు గుర్తించారు. పోలీసుల సమాచారం మేరకు పరిశీలించిన కుటుంబ సభ్యులు మృతిపై పలు అనుమానాస్పదనాలు వ్యక్తం చేశారు. తన తమ్ముడి తలపై బలమైన గాయాలు ఉన్నాయని, అతనికి ఎవరో కొట్టి చంపారని మృతుడి అన్న ఆరోపించారు. కుటుంబ సభ్యులకు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని పోస్టుమార్టం నిర్వహించి దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ నరసింహులు, ఎస్సై రమేష్ తెలిపారు.






# మూవీభేరి

## మీ రాజకీయ మైలేజీ కోసం నా పేరును వాడొద్దు..

బాధ్యతాయుతమైన స్థానంలో ఉన్న ఓ మహిళ మరో మహిళపై వ్యాఖ్యలు చేయడం ఎంతగానో బాధించింది. మేమంతా మౌనంగా ఉండటాన్ని బలహీనతగా భావిస్తున్నారు. నాకు ఎలాంటి రాజకీయ సంబంధాలు లేవు. మీ రాజకీయ మైలేజీ కోసం నా పేరును ఉపయోగించవద్దు. కళాకారులను రాజకీయ వికృత క్రీడలో భాగం చేయొద్దు. సంచలనాల కోసం వారిపై కల్పిత కథనాలను సృష్టించవద్దు రకుల్‌ప్రీత్ సింగ్.



## ఆ వార్తల్లో నిజం లేదు.. యానిమల్ భామ

'యానిమల్' చిత్రంతో ఓవర్‌నైట్‌లో స్టార్‌డమ్‌ను సంపాదించుకుంది కథానాయిక త్రిప్తి డిమ్రి. ప్రస్తుతం ఈ భామ వరుస సినిమాలతో బిజీగా ఉంది. తాజాగా ఆమె ఓ వివాదంలో చిక్కుకుంది. వివరాల్లోకి వెళితే..ఇటీవల జైపూర్‌లో మహిళా పారిశ్రామికవేత్తలు ఓ సదస్సును నిర్వహించారు. దీనికి పలువురు బాలీవుడ్ స్టార్‌స్‌ను కూడా ఆహ్వానించారు. వారిలో త్రిప్తి డిమ్రి కూడా ఉంది. ఈ కార్యక్రమంలో పాల్గొనడానికి నిర్వాహకులు ఆమెకు ఐదు లక్షల రూపాయలను అందించారని తెలిసింది. అయితే తన తాజా చిత్రం 'విక్కీ విద్య కా వోవాలా వీడియో' ప్రమోషన్‌లో బిజీగా ఉండటం వల్ల త్రిప్తి డిమ్రి మహిళా పారిశ్రామికవేత్తల సదస్సుకు హాజరుకాలేక పోయింది. దీంతో నిర్వాహకులు ఆమె వ్యహహార శైలిని తప్పుబడుతూ, ఈవెంట్‌లో ఏర్పాటు చేసిన ఆమె పోస్టర్లను ధ్వంసం చేశారు. ఈ వీడియోలు సోషల్‌మీడియాలో వైరల్‌గా మారాయి. ఈ వ్యవహారంపై త్రిప్తి డిమ్రి వ్యక్తిగత టీమ్ స్పష్టత నిచ్చింది. జైపూర్ ఈవెంట్‌లో పాల్గొనడానికి త్రిప్తి డబ్బులు తీసుకుందనే వార్తలు పూర్తి అవాస్తవమని, సినిమా ప్రమోషన్‌లో బిజీగా ఉండటం వల్లే అక్కడకు వెళ్లలేకపోయిందని వివరణ ఇచ్చారు. 'వృత్తిపరంగా త్రిప్తి చాలా బాధ్యతాయుతంగా వ్యవహరిస్తుంది. ప్రైవేట్ ఈవెంట్స్‌కు కూడా ఆమె డబ్బులు తీసుకోదు. దయచేసి ఈ పుకార్లకు ఫుల్‌స్టాప్ పెట్టండి' అని ఆమె టీమ్ స్పష్టం చేసింది.





## 'గాంధీజీ'పై వెబ్ సిరీస్ సంగీత దర్శకుడిగా ఏఆర్ రెహమాన్

జాతిపిత మహాత్మా గాంధీపై వెబ్ సిరీస్ రాబోతుంది. ఇప్పటివరకు గాంధీజీపై ఎన్నో సినిమాలతో పాటు వెబ్ సిరీస్‌లు వచ్చిన విషయం తెలిసిందే. ఇప్పుడు మహాత్ముడి జీవిత కథతో మరో వెబ్ సిరీస్ రాబోతుంది. స్కామ్ 1992, అలీఘర్, షాహిద్, స్కూప్ వంటి సంచలన చిత్రాలు తెరకెక్కించిన బాలీవుడ్ దర్శకుడు హన్సల్ మెహతా ఈ సిరీస్‌కు దర్శకత్వం వహించబోతుండగా.. అప్లాజ్ ఎంటర్‌టైన్‌మెంట్ స్టూడియో నిర్మించబోతుంది. ఈ సినిమాలో గాంధీజీ పాత్రలో స్కామ్ 1992 నటుడు ప్రతీక్ గాంధీ నటించబోతున్నాడు. అయితే ఈ వెబ్ సిరీస్‌కు సంబంధించి ఇంట్రెస్టింగ్ అప్‌డేట్‌ను మేకర్స్ పంచుకున్నారు. ఈ సిరీస్‌కు ప్రముఖ సంగీత దర్శకుడు ఏఆర్ రెహమాన్ సంగీతం అందించనున్నట్లు అధికారికంగా ప్రకటించింది. అయితే ఈ వెబ్ సిరీస్ గురించి ఏఆర్ రెహమాన్ మాట్లాడుతూ.. గాంధీ జయంతి సందర్భంగా ఈ ప్రెస్టీజియస్ ప్రాజెక్ట్ చేయబోతున్నా. ఈ చిత్రంలో గాంధీజీ జీవితం, సౌత్ ఆఫ్రికాలో ఆయన గడిపిన క్షణాలు, దేశ స్వాతంత్ర్యం కోసం ఆయన చేసిన పోరాటం గురించి ఉండబోతున్నట్లు తెలిపాడు. హన్సల్ మెహతా దర్శకత్వంలో వస్తున్న ఈ సిరీస్‌కు సంగీతం అందించడం గౌరవంగా ఉందంటూ రెహమాన్ తెలిపాడు.

## ఎన్టీఆర్ అభిమానులకు గుడ్‌న్యూస్.. 'దేవర'లో దావూదీ సాంగ్

ఎన్టీఆర్ కథానాయకుడిగా వచ్చిన దేవర చిత్రం బాక్సాఫీస్ వద్ద పరుగులు పెడుతుంది. ఫస్ట్ రోజే రూ.172 కోట్ల వసూళ్లను రాబట్టిన ఈ చిత్రం రెండు రోజుల్లో రూ.243 కోట్ల వసూళ్లను సాధించింది. అయితే ఆదివారం వీకెండ్‌తో రూ.300 కోట్ల క్లబ్‌లోకి ఎంట్రీ ఇచ్చింది ఈ చిత్రం. ఇప్పటివరకు ఈ చిత్రం రూ.393 కోట్లకు పైగా వసూళ్లను రాబట్టి బ్రేక్ ఈవెన్‌ను కూడా కంప్లీట్ చేసుకుంది. అయితే ఈ సినిమా నుంచి దావూదీ అనే సాంగ్‌ను చిత్రయూనిట్ తొలగించిన విడుదల చేసిన విషయం తెలిసిందే. దీంతో ఈ పాటను థియేటర్లో చూద్దాం అనుకున్న ప్రేక్షకులకు నిరాశే ఎదురైంది. అయితే తాజాగా అభిమానులకు గుడ్ న్యూస్ చెబుతూ.. ఈ పాటను థియేట్రికల్ వెర్షన్‌లో రేపటినుంచి జత చేయబోతున్నట్లు ప్రకటించారు. చాలా రోజుల తర్వాత తారక్ సోలోగా రావడంతో ఫ్యాన్స్‌తో పాటు మూవీ లవర్స్ థియేటర్లకు క్యూ కడుతున్నారు. కొరటాల శివ దర్శకత్వంలో వచ్చిన ఈ చిత్రంలో జాన్వీకపూర్ కథానాయికగా నటించగా. సైఫ్ అలీఖాన్ విలన్‌గా నటించాడు. నందమూరి కల్యాణ్‌రామ్ సమర్పించగా.. యువసుధా ఆర్ట్స్ పతకంపై మిక్కిలినేని సుధాకర్, హరికృష్ణ.కె సంయుక్తంగా నిర్మించారు.



Printed and Published & Owned by MOTHE RAGHU THIRUPATHI REDDY, Printed at DOLPHIN GRAPHICS, #24-88/1, L.N. Colony, IDA Uppal, Hyderabad, Medchal-Malkajgiri, telangana-500039.
Published at # 2-20-2/71/C, Ganesh Nagar, Uppal, Hydrebad, Medchal-Malkajgiri-500039. Editor: M. R. Thirupathi Reddy. Cell: 9391 544 889 RNI No: TELTEL12264. email: jayabherinews@gmail.com, www.jayabheridaily.com